GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
# టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్
సంపుటి : 7 సంచిక : 96 ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ బుధవారం11-12-2024 పేజీలు : 3

## రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం..

**టి మీడియా, డిసెంబర్ 10,హైదరాబాద్ :**



రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎగువ సభలో ఛైర్మన్ వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ఎంపీలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి ఛైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ఇండియా కూటమి పార్టీలైన తృణమూల్, ఆమ్ ఆద్మీపార్టీ, సమాజ్ వాదీపార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ సెక్రటేరియట్‌కు సమర్పించారు. ఛైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు ఛైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని కాంగ్రెస్ అధ్యక్షుడు, సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే మైక్రోఫోన్‌ను ఛైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీలు వాదిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు ఛైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ఒకరు తెలిపారు.

# చంద్రబాబు సర్కార్ ఫుల్ ఫోకస్




- **నిర్మాణాలకు సీఆర్‌డీఏ తొలి ఆమోదం**

**టి మీడియా, డిసెంబర్ 10,అమరావతి :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి కొత్త ఊపిరిపోసుకుంది. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత అమరావతి సహా పోలవరంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది ప్రభుత్వం. ఈ క్రమంలో అమరావతిలో నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వం.. నిధులు సమకూర్చడంపై ఫోకస్ పెట్టింది. నిర్మాణాలకు సంబంధించితాజాగా ముందడుగు పడింది. సి ఆర్ డిఏ ఆమోదించిన 20 సివిల్ పనులను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనులకు 11 వేల 467 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సంయుక్తంగా ఇవ్వనున్న రుణంతో ఈ పనులు చేపట్టేలా కార్యాచరణ సిద్ధమౌతుంది.ప్రభుత్వం ఆమోదించిన పనుల్లో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగుల నివాస అపార్ట్‌మెంట్లు, ఐఎఎస్ అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాల నిర్మాణాలు ఉన్నాయి. న్యాయమూర్తులు, మంత్రులు, సీనియర్ ఐఎఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ, రాజధాని పరిధిలో మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం నిధులను వెచ్చించాలని నిర్ణయించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా 1200 ఫ్లాట్స్‌తో నిర్మించనున్న12 టవర్ల నిర్మాణానికి 984 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది ప్రభుత్వం. అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగును వెడల్పు చేయటంతో పాటు శాఖమూరు, నీరు కొండ దగ్గర రిజర్వాయర్ నిర్మాణం కోసం 1585 కోట్ల రూపాయలు వెచ్చించనుంది.రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ లే అవుట్‌లలో రోడ్లు, మౌలిక వసతుల కోసం ఇప్పటికే 3,859 కోట్లు కేటాయించింది ప్రభుత్వం. జనవరిలో పనులు ప్రారంభించి, మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేసేలా అడుగులు వేస్తోంది. అమరావతి అభివృద్ధిలో భాగంగా తొలిదశలో 15 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అత్యున్నత ప్రమాణాలతో అమరావతిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు, ట్రంకు రోడ్లను నిర్మిస్తారు. వరద నీటి నిర్వహణ పనులు, రిజర్వాయర్ల పునరుద్ధరణ, వరదను తట్టుకునే వ్యవస్థలను నిర్మిస్తారు. స్వచ్ఛమైన నీటి సరఫరా వ్యవస్థ, రోడ్లు, పార్కులు, హరిత నిర్మాణాలు చేపడుతారు. అత్యున్నత ప్రమాణాలతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అందుకు అనుగుణంగానే అడుగులు పడుతున్నాయి.

## శాసనసభ్యుల అవగాహన తరగతులు బహిష్కరిస్తున్నాం : కేటీఆర్



టి మీడియా, డిసెంబర్ 10,హైదరాబాద్:ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అవగాహన తరగతులను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మా హక్కులకు భంగం కలిగేలా స్పీకర్ వ్యవహరించారని కేటీఆర్ తెలిపారు. తొలిరోజే తమను లోపలికి రాకుండా అరెస్టు చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు ఎత్తిచూపితే అరెస్టు చేశారని చెప్పారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని కేటీఆర్ అన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ తమ గొంతు నొక్కేలా వ్యవహరించారని తెలిపారు. తమకు అవకాశం ఇవ్వకుండా స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించారని పేర్కొన్నారు. తమ శాసనసభ్యుల్లో అతి తక్కువ మంది మాత్రమే కొత్త వాళ్లు ఉన్నారని తెలిపారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్పీకర్ వ్యవహారశైలికి నిరసనగా రేపటి నుంచి జరగనున్న అవగాహన తరగతులను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా ఎలాంటి వివక్ష లేకుండా వ్యవహరించాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశారు.

## కూటమి అభ్యర్థుల నామినేషన్స్

### పోటీకి వైసిపి దూరం ఏకగ్రీవం ఛాన్స్


3లో..



## మోహన్‌బాబు దౌర్జన్యం..

- **మైక్ లాక్కొని జర్నలిస్టులపై దాడి**

టి మీడియా, డిసెంబర్ 10,హైదరాబాద్:



జల్‌పల్లిలో హైడ్రామా కొనసాగుతోంది. ప్రైవేటు బౌన్సర్ల సాయంతో గేట్లు తోసుకుంటూ మంచు మనోజ్ ఇంట్లోకి వెళ్లడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో దాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన ఓ మీడియా ప్రతినిధిపై మోహన్‌బాబు దౌర్జన్యానికి దిగారు. ఓ జర్నలిస్టు చేతిలో నుంచి మైక్ లాక్కొని ఆవేశంగా అతనిపై దాడి చేశాడు.మోహన్‌బాబు అకస్మాత్తుగా దాడి చేయడంతో అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మీడియా ప్రతినిధులు, బౌన్సర్లను బయటకు పంపించేశారు. ఈ ఘటన తర్వాత మోహన్‌బాబు, ఆయన పెద్ద కుమారుడు మంచు విష్ణు కూడా అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు.మంచు ఫ్యామిలీలో నెలకొన్న వివాదాల నేపథ్యంలో మోహన్‌బాబు గన్‌ను సీజ్ చేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మోహన్‌బాబుతో పాటు మంచు విష్ణు వద్ద ఉన్న గన్‌ను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు.

## సిద్దిపేటలో వెంకన్న ఆలయం

- **టీటీడీ ఛైర్మన్‌కు హరీశ్‌రావు విజ్ఞప్తి**




**టీ మీడియా, డిసెంబర్ 10,తిరుమల:**

కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సిద్దిపేటలో కొలువు దీరనుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. మంగళవారం తిరుపతి వెళ్లిన హరీశ్ రావు టీటీడీ బోఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్దిపేట కోమటి చెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు.వేంకటేశ్వర ఆలయ నిర్మాణం కోసం సిద్దిపేట కోమటి చెరువు ప్రాంతంలో 5 ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని టీటీడీ ఛైర్మన్‌తో హరీశ్‌రావు తెలిపారు. గతంలోనే టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. దానికి అనుగుణంగా ఆలయ నిర్మాణ నమునా, డిజైన్స్ ను రూపొందించారని వివరించారు.తిరుపతి వేంకటేశ్వర స్వామి అంటే ప్రజలు ఇష్ట దైవంగా.. ఇలవేల్పుగా కొలుస్తారని, అలాంటి ఆలయం సిద్దిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమని హరీశ్‌రావు అన్నారు. వచ్చే టీటీడీ బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి ఆమోదం తెలిపి, మీరే ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా బీఆర్ నాయుడిని కోరారు. అందుకు ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వెంటనే చీఫ్ ఇంజనీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## రాష్ట్రపతి పర్యటనపై తెలంగాణ సీఎస్ సమీక్ష

**టి మీడియా, డిసెంబర్ 10,హైదరాబాద్ :**



శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్ లో పర్యటించబోతున్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై అటవీ, జీహెచ్ఎంసీ, పోలీస్, ఆర్ అండ్ బీ, ఎంఏయూడీ, ఇంధన శాఖ అధికారులకు సీఎస్ ఆదేశాలు ఇచ్చారు. ఈ సమీక్షలో డీజీపీ జితేందర్, హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, జీఏడీ సెక్రటరీ రఘునందన్ రావు, స్పెషల్ కమిషనర్, ఐ అండ్ పీఆర్ హరీశ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మోహన్‌బాబు కుటుంబంలో వివాదం

- **కొనసాగుతున్న చర్చలు**
- **ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత**

**టి మీడియా, డిసెంబర్ 10,హైదరాబాద్ :**



మోహన్‌బాబు కుటుంబంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో .. విదేశాల నుంచి విష్ణు హైదరాబాద్‌కు మంగళవారం వచ్చారు. ఆయన వచ్చిన తర్వాత మరోసారి చర్చలు జరుగుతున్నాయి. సన్నిహితుల సమక్షంలో మోహన్‌బాబు, విష్ణు, మనోజ్‌ల మధ్య చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. సోమవారము కూడా పెద్ద మనుషుల సమక్షంలో మోహన్‌బాబు, మనోజ్‌ల మధ్య చర్చలు జరిగాయి.

### నా పోరాటం ఆస్తి కోసం కాదు.. ఆత్మగౌరవం కోసం: మనోజ్

ఆస్తి కోసమో.. డబ్బు కోసమో తాను పోరాటం చేయడం లేదని మంచు మనోజ్ అన్నారు. తన ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఇది తన భార్య పిల్లల రక్షణకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. “నన్ను తొక్కేయడానికి భార్య,పిల్లల అంశాన్ని తెస్తున్నారు. నేను పోలీసుల వద్దకు వెళ్లి రక్షణ అడిగా. నా ఇంటి వద్ద మోహరించిన బౌన్సర్లను పోలీసులకు చూపించా. నాకు అన్ని విధాలా రక్షణ కల్పిస్తామన్న పోలీసులే పారిపోయారు” అని మనోజ్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు.



### ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత

హైదరాబాద్: హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విష్ణు బౌన్సర్లు, మనోజ్ బౌన్సర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన మనోజ్ బౌన్సర్లను విష్ణు బౌన్సర్లు అడ్డుకుని బయటకు తోసేశారు. తండ్రీకొడుకులు మోహన్ బాబు, మంచు మనోజ్ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇప్పటికే పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మంచు విష్ణు దుబాయి నుంచి ఇంటికి రాగానే మరోసారి వివాదం చెలరేగినట్లు సమాచారం. విష్ణు రావడంతో అతని బౌన్సర్లు భారీ సంఖ్యలో జల్‌పల్లిలోని మోహన్ బాబు ఇంటికి చేరుకున్నారు. ఆ తర్వాత మనోజ్ బౌన్సర్లను ఇంటి నుంచి బయటకు పంపించారు. ఈ క్రమంలో ఇరువురి బౌన్సర్ల మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. మనోజ్ బౌన్సర్లు, అనుచరులు ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని విష్ణు బౌన్సర్లు, అనుచరులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇలా మంచు ఫ్యామిలీ వివాదం గంటకో మలుపు తిరుగుతోంది.

### ఏపీకి త్వరలో కొత్త డీజీపీ మొదలైన కసరత్తు

3లో..


### అదానీ ముడుపుల వ్యవహారం

3లో..

## సరిదిద్దే బాధ్యత తీసుకోండి

- **పవన్‌కు ఉండవల్లి లేఖ**

**టి మీడియా, డిసెంబర్ 10,అమరావతి :**



2014లో విభజన కారణంగా ఏపీకి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే బాధ్యతను తీసుకోవాలని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను సీనియర్ రాజకీయ నేత, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన నాలుగు పేజీల లేఖను రాశారు బీజేపీతో కలిసి అధికారంలో ఉండటంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సినవి రాబట్టుకోవడానికి శ్రద్ధ తీసుకోవాలని అభ్యర్థించారు. సుప్రీంకోర్టులో చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న రాష్ట్ర విభజన అంశాన్ని కూడా ఒక కొలిక్కి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు..పార్లమెంట్‌లో రాజ్యసభ విభజన జరిగిన తీరును లేఖలో ప్రస్తావించిన ఆయనే.. ఈ విషయంపై నేను సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉంది.. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదన్నారు.. గతంలో ఇలాంటి విషయాలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానని, . రాష్ట్రం తరపున సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని నిర్ణయించారు.. కానీ, కారణాలేమైనా అవి అమలు కాలేదని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు..అయితే, ఈ విషయంపై శ్రద్ధ తీసుకుని.. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ విభజన జరిగిన తీరూ తర్వాత మనకు జరిగిన అన్యాయం విషయమై చర్చకు నోటీసులు ఇప్పించాలని కోరారు. సుప్రీంకోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో పడిపోయిన రాష్ట్ర విభజన అంశాన్ని త్వరితగతిన ఒక కొలిక్కి తీసుకురావాలని అన్నారు ఉండవల్లి .

# సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కేఎం తివారీ కన్నుమూత

**టి మీడియా, డిసెంబర్ 10,న్యూఢిల్లీ:**
సీపీఐఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఢిల్లీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కేఎం తివారీ (70) కన్నుమూశారు. ఆయన గత కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం సీపీఐ ఎం ఘజియాబాద్ జిల్లా కమిటీ కార్యాలయంలో, బుధవారం ఉదయం 09.30 నుంచి 11 గంటల వరకు హెచ్‌కేఎస్ సుర్జీత్ భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని దహన సంస్కారాల కోసం బోద్ ఘాట్‌కు తరలిస్తారు.తివారీ ట్రేడ్ యూనియన్



నాయకుడిగా సీపీఐ(ఎం) నాయకత్వానికి ఎదిగారు. 1977లో సిపిఎంలో చేరిన ఆయన%ొ% 1988లో ఢిల్లీ రాష్ట్ర కమిటీకి, 1991లో సెక్రటేరియట్‌కు, 2018లో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 2014 నుంచి 2024 వరకు సీపీఐఎం ఢిల్లీ రాష్ట్రకార్యదర్శిగా పనిచేశారు. ఘజియాబాద్ పారిశ్రామిక రంగంలో సిఐటియు నాయకత్వంలో అసంఖ్యాక సమ్మెలకు తివారీ నాయకత్వం వహించడంతో పాటు రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. చాలా సంవత్సరాలు సిఐటియు వర్కింగ్ కమిటీ, జనరల్ కౌన్సిల్‌లో పనిచేశారు. జాతీయ కార్యక్రమాల్లో భాగంగా మూడు నెలలకు పైగా జైలు జీవితం గడిపిన ఆయన మూడేళ్ల తొమ్మిది నెలలు అజ్ఞాతంలో గడిపారు. తివారీ మృతికి సీపీఐఎం పొలిట్‌బ్యూరో సంతాపం తెలిపింది.

# మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ మృతికి మోడీ సంతాపం

**టి మీడియా, డిసెంబర్ 10,ఢిల్లీ:**
కర్నాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ (92) మృతికి ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎస్ఎం కృష్ణ అసాధారణ నేత అని, జీవితాంతం ఆయన ఇతరుల కోసం పాటుపడ్డారని గుర్తు చేసుకున్నారు. కర్నాటక సీఎంగా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని.. ఆయన అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ప్రత్యేకంగా మౌలిక సదుపాయాల కల్పనపై ఎక్కువ శ్రద్ధ చూపేవారని పేర్కొన్నారు. ఎస్ఎం కృష్ణలో గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు ఉన్నారని ప్రధాని కొనియాడారు. అనేక సార్లు తాను ఆయనతో సమావేశమయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబసభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.





# బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్..

**టి మీడియా, డిసెంబర్ 10,తాండూరు :**
రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఇటీవలే నారాయణ పేట జిల్లా పరిధిలోని మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో 40 మంది విద్యార్థులు విషాహారం తిని తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. అయితే, ఆ ఘటన మరువక ముందు తాజాగా, వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలోని సాయిపూర్ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు హాస్టల్‌లో వండిన ఆహారం తిని 30 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన హాస్టల్ సిబ్బంది హుటాహుటిన విద్యార్థినులను తాండూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లుగా తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



# కాండం తొలుచు పురుగును ప్రారంభదశలోనే కట్టడి చేయాలి

- వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున..

**టీ మీడియా, డిసెంబర్ 10,తొగుటబి**
కాండం తొలుచు పురుగు ప్రారంభ దశలోనే క్రిమి సంహారక మందుల చల్లి నష్టాన్ని తగ్గించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున తెలిపారు. బండారు పల్లి గ్రామానికి చెందిన కోక సుధాకర్ రెడ్డి అనే రైతు వరి నాటు వేశాడు. పొలం చుట్టుపక్కల వరి పొలాలు లేకపోవడం వలన కాండం తోలుచు తల్లి రెక్కల పురుగు ఉధృతి అధికంగా ఉందని మంగళవారం రైతులకు సూచన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో కాండం తొలుచు పురుగును దీపపు ఎరా (సోలార్ లైట్ ట్రాప్) వరి పొలాల్లో పెట్టుకోవాలని సూచించారు. వరి కాండం తోలుచు పురుగు మొక్క కాండం భాగాన్ని తీనివేసి నందున మొక్క కు సరిపడ పోషక పదార్థాలు అందక తెల్లకంకి గా మారి తాలు గింజలు ఏర్పడతాయన్నారు. పిలక దశ కంటే కంకి దశలో ఈ పురుగు నష్టం అధికంగా చెప్పారు. కాండం తొలుచు పురుగు పంట యొక్క ప్రారంభ దశలో కనిపిస్తుందని అన్నారు. వరిలో నష్టం కలిగించే కాండం తొలుచు పురుగుని దీపపు ఎరా ( సోలార్ లైట్ ట్రాప్) ద్వారా తల్లి రెక్కల పురుగును కట్టడి చేయవచ్చు, ఉధృతిని గమనించవచ్చని అన్నారు. ఉధృతిని బట్టి పురుగుల మందు పిచికారి చేసుకోవాలి తల్లి రెక్కల పురుగు ను కట్టడి చేయడం ద్వారా గుడ్ల ఉత్పత్తిని ఆప వచ్చు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సింలు, మల్లయ్య, సత్య లింగం, పండరి పాల్గొన్నారు.

# ప్రతిబావంతున్ని సన్మానించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
రెండోసారి లెక్చరర్ ఉద్యోగం సాధించిన వనపర్తి మండలం చందాపూర్ గ్రామానికి చెందిన యువకుడు టీజీపీఎస్సీ బుధవారం విడుదల చేసిన జనరల్ జూనియర్ లెక్చరర్ ఫలితాలలో వనపర్తి మండలం చందాపూర్ గ్రామానికి చెందిన బాబు-అలివేలమ్మ



దంపతుల కుమారుడు అనిల్ కుమార్ తెలుగు సబ్జెక్టులో గెజిటెడ్ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. నాలుగు నెలల క్రితం వెలుబడిన గురుకుల ఫలితాల్లో ఎంపికై జూనియర్ లెక్చరర్ గా పెద్దమందడి ట్రైబల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ కుమార్ టీఎస్ సెట్, యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ లు సాధించి సమకాలీన తెలంగాణ గజల్ ఒక పరిశీలన 2001-2020 అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలో పి.హెచ్.డి చేస్తున్నారు. మరోసారి లెక్చరర్ గా ఉద్యోగ సాధించడం పట్ల అభినందించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మండల యూత్ అధ్యక్షులు చిట్యాల రాము ,మండల ఉపాధ్యక్షులు కురుమూర్తి, హేమంత్ ముదిరాజ్ ,సూర్యవంశం గిరి, గ్రామ ప్రెసిడెంట్ నాగరాజు ,దత్తాయపల్లి వెంకటేష్ ,జగత్ పల్లి వెంకటేష్ ,నరసింహ ,తవేరా శ్రీను ,తోట శ్రీను ,తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ ఆడిన అదనపు కలెక్టర్

**టీ మీడియా, డిసెంబర్ 10,ఆదిలాబాద్ :**
గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుక ప్రభుత్వం సీఎం కప్ ద్వారా పోటీలను నిర్వహిస్తుందని, క్రీడాకారులు, విద్యార్థులు ప్రతిభను చాటాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. మండల స్థాయి సీఎం కప్ క్రీడపోటీలను పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. దీనికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆమెకు స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. అనంతరం క్రీడాకారులని పరిచయం చేసుకుని విద్యార్థులతో కలిసి కబడ్డి ఆడి ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన ఎంతో మంది క్రీడాకారులున్నారన్నారు. వారికి సరైన



ప్రోత్సహం అందించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతో దోహదం చేస్తామన్నారు. గ్రామ స్థాయిలో రెండు రోజుల పాటు పోటీలు జరిగాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి పోటీలు నిర్వహిస్తున్నామని, ఇక్కడ గెలుపొందిన వారికి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్బన్ క్రీడ పోటీలు బుధవారం స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడ స్ఫూర్తితో ఆడి రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతరావు, పేట సంఘం కార్యదర్శి ఎన్.స్వామి, ఎంఈఓ సోమయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ను కలిసిన హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ సభ్యులు

**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నాగరిగారి ప్రీతం ను ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వనపర్తి జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా హైదరాబాద్ లోని వారి చాంబర్లో కలిసి పలు అంశాలపై చర్చించడం జరిగింది.వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల కల్పిస్తున్న కార్పొరేషన్ బ్యాంకు రుణాలు సత్వరమే విడుదల చేయు విధంగా చర్య తీసుకోగలరని మనవి చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ జిటి శ్యామ్, జిల్లా అధ్యక్షుడు విశ్వం బాబు ,జిల్లా ప్రధాన కార్యదర్శి గద్వాల ఆంజనేయులు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గొర్ల శైలన్ కుమార్ , కేశపోగు సామెల్ తదితరులు పాల్గొన్నారు.



# డాక్టరేట్ పొందిన మేఘావత్ రవి నాయక్

**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి డాక్టరేట్ పొందిన తొలి గిరిజన బిడ్డగా నిలిచిన మేఘావత్ రవి నాయక్ కి సన్మానించి, అభినందనలు తెలిపిన బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ .వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం, గట్ల ఖానాపూర్ గ్రామం పుల్యా తండాకు చెందిన తల్లి బామిని,తండ్రి పుల్యా నాయక్ దంపతుల కుమారుడు అయిన మేఘావత్ రవి కి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి ఫార్మసీ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేటు పొందారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన మెగావత్ రవి చిన్నప్పటి నుంచి తన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి చేయడం జరిగింది.

మెగావత్ రవికి బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ , గిరిజన యువ నాయకులు అరవింద్ నాయక్, అరుణ్ నాయక్ అభినందనలు తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి, ఉస్మానియా యూనిర్సిటీలో ఫార్మా స్యూటికల్ డిపార్టుమెంటు యందు "ఫార్ములేషన్ అండ్ ఎవాల్యూషన్ ఆఫ్ లిపోసోమల్ జెల్ ఫర్ ట్రాన్సర్మల్ అప్లికేషన్ యూజింగ్ అంటి బ్యాక్టీరియల్ ఏజెంట్స్ అనే టాపిక్ పై పీహెచ్డీ పట్టా పొందారు.

## రికార్డు స్థాయిలో పడిపోయిన రూపాయి

**టి మీడియా, డిసెంబర్ 10,ఢిల్లీ:**
రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది. మంగళవారం (డిసెంబర్ 10) ప్రారంభ ట్రేడింగ్ లో యూఎస్ డాలర్ తో పోలిస్తే 84.75 ఉన్న రూపాయి విలువ 9 పైసలు దిగజారి 84.83 లకు చేరింది. బ్యాంకర్లు, దిగుమమతి దారుల నుంచి యూఎస్



డాలర్ కు పెరుగుతున్న డిమాండ్ తో రూపాయి విలువ కనిష్టస్థాయికి చేరింది. ఆర్బీఐ గవర్నర్ సంజయ మల్హోత్రా నియామకంతర్వాత దేశీయ యూనిట్ రికార్డు స్థాయిలో కనిష్ట స్థాయికి చేరుకుంది. రూపాయి ఇంట్రాడేడ గరిష్టంగా 84.85 కనిష్టంగా 84.80 వద్ద నమోదు అయింది.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుకి సన్మానం

**టీ మీడియా ,డిశంబర్ 9,ధర్మారం:**
మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవి జనార్దన్ ఆధ్వర్యంలో ధర్మారం మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గా సోగాల తిరుపతి ని ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ నియమించిన సందర్భంగా ధర్మారం కాంగ్రెస్ నాయకులు,యువకులు



తిరుపతి కి పుష్ప గుచ్చం ఇచ్చి శాలువ కప్పి సత్కరించి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండుగల సాయన్న వర్ధంతి

**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
పాలమూరు ప్రజా వీరుడు తెలుగోల్ల ముద్దుబిడ్డ తెలంగాణ రాబిన్ తెలంగాణ పేద ప్రజలు ముద్దుగా పిలుచుకునే పండుగ సాయన్న 134 వర్ధంతి కార్యక్రమం వనపర్తి జిల్లా హెడ్ క్వార్టర్ రాజీవ్ చౌరస్తాలో పండుగ సాయన్న వర్ధంతి కార్యనిర్వాహక అధ్యక్షులు నందిమల్ల చంద్రమౌళి ఆధ్వర్యంలో కుల పెద్దలు బి సి ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిన్న రాములు , తెలంగాణ ముదిరాజ్ రాష్ట్ర నాయకులు జింకల కృష్ణయ్య, వనపర్తి పట్టణ మత్స్యకార సొసైటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు బి కృష్ణయ్య , ముందేకోటి లక్ష్మయ్య పూల మాలను సమర్పించి కొబ్బరికాయలను కొట్టి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పెద్దలు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో మన ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలం మెరుగుకొని పల్లె గ్రామంలో జన్మించిన అంతయ్య సాయమ్మ దంపతులకు ముద్దుబిడ్డగా సాయన్న జన్మించాడు.స్వాతంత్ర ఉద్యమ కాలంలో నైజాం రజాకార్లు జమీందారులు జాగీర్ పెత్తందారుల దోపిడీ పీడనకు వ్యతిరేకంగా తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పెద్దలను కొట్టి పేదోళ్లకు పంచిపెట్టిన సాయన్న ఏ గ్రామంలోకి వెళితే ఆ గ్రామంలో సహపంక్తి భోజనాలు పేదలకు పెట్టేవారు సాయన్న ఏ గ్రామంలోకి వెళ్లిన పండుగ వాతావరణం సృష్టించేవారు అందుకే పరిసర ప్రాంత పేద ప్రజలందరూ కలిసి పండుగ సాయన్నగా బిరుదు అంకితం చేశారు. నేటి యువత ఈనాటికీ గ్రామంలో పెత్తందారుల దౌర్జన్యాలు



జరుగుచున్నందున తిరుగుబాటు చేసి గ్రామాలలో ప్రజాస్వామ్యాన్ని స్థాపించుకోవాలి సింహాలు తమ చరిత్ర తాము రాసుకోకపోతే వేట కుక్కలు రాసిందే చరిత్రగా మనకు తెలుస్తుంది అని పెద్దలు వారి ఉపన్యాసంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చుక్కారాజు, సమాజ్వాది పార్టీ రాష్ట్ర నాయకులు జయరాములు, గంగపుత్ర సేవ సమితి వనపర్తి పట్టణ అధ్యక్షుడు ఎర్ర మన్యం, కాంగ్రెస్ నాయకులు రాగి వేణు, బాలుటి బాలస్వామి, జానంపేట శ్రీనివాసులు, అడ్వకేట్ త్రినాథ్ చుక్క సత్యం, చుక్క పెంటన్న, డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు సంద రమేష్, నాగేంద్రం, రవి, బజార్ యాధాకృష్ణ, వి రామస్వామి, మన్యం , బిసన్న, అంజి, గోకం భాస్కర్, గోకం బాలరాజు, గోకం రాఘవేంద్ర , రాయినపల్లి జింకల శ్రీను, బోలెమోని నరసింహ, ఊదరి రమణ , శివ స్వామి, గోకం అంజి, అధ్యక్షులు జానంపేట నాగరాజు, నరసింహ, వింధే కోటి రంగస్వామి, తెలుగు మత్స్యకార సంఘం నాయకులు ముదిరాజ్ పెద్దలు పాల్గొన్నారు.

## ధరణి ఉద్యోగస్తులు కార్యవర్గ సమావేశం

- జిల్లా అధ్యక్షులుగా జి. భాను ప్రకాష్

**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా ధరణి కార్యవర్గ సమావేశంలో జిల్లా ధరణి ఉద్యోగస్తులు అందరూ పాల్గొని ఏకగ్రీవంగా రెండవ సారి వనపర్తి జిల్లా అధ్యక్షుడుగా జి భాను ప్రకాష్ ని ఎన్నుకొని అందరి సమక్షంలో శాలువాతో సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షుడు



మాట్లాడుతూ పెండింగులో ఉన్న జీతాలను తొందరలోనే విడుదల చేయించడం జరుగుతుంది. కొత్త సంవత్సరం నుండి ప్రతి నెల జీతాలు వచ్చే విధంగా రాష్ట్ర కమిటీ తో కలసి సాధిస్తామని హామి ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా గౌరవధ్యక్షుడు కే.బీ .జగదీశ్ కుమార్ , జిల్లా కోఆర్డినేటర్ గోవర్ధన్ , జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ మంజునాథ్ , ప్రధాన కార్యదర్శులు దివ్య, భారతి, సారంగి కిరణ్, కుమార్ , జిల్లా కోశాధికారి వినయ్ కుమార్ , జిల్లా ఈసీ మెంబర్ అయిన లక్ష్మీ కాంత్ , గంధం రాముడు , రాఘవేంద్ర, హరీష్ , శ్రీధర్ , రామచంద్రుడు , ఓం ప్రకాష్ , బాలకృష్ణ , కేశవ్ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## తల్లిని మళ్లీ స్మశానంలో వదిలేసిన కొడుకులు

**టీ మీడియా, డిసెంబర్ 10, జగిత్యాల :**
తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన కొడుకులు తల్లిని భారంగా భావిస్తు న్నారు. కొందరు వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపిస్తుంటే కొందరు మాత్రం కనీస కనికరం కూడా చూపడంలేదు. అనాథలుగా రోడ్లపైన వదిలేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో వృద్ధు



రాలు స్మశాన వాటికలో ఉంటున్న విషయము గత నెల 28న వెలుగులోకి వచ్చింది, అప్పుడు అధికా రులు ఆమె కొడుకులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వగా ఇంటికి తీసుకెళ్లారు. 12 రోజుల తర్వాత వృద్ధాప్యంలో ఉన్న కన్నతల్లిని రెండవసారి స్మశాన వాటికలో వదిలి వెళ్ళిపోయాడు. మూడు రోజుల నుండి స్మశానం లో వృద్ధురాలు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపు తుంది,

## విద్యా సంస్థలో కమిటీలను ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్

**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కలెక్టర్ సమావేశ మందిరము నందు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల ప్రిన్సిపల్ కోఆర్డినేటర్లతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి, ఇతర జిల్లా అధికారులతో పాటు సంయుక్త సమావేశం నిర్వహించి అందులో విద్యార్థులు



ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాల గురించి చర్చించి ముఖ్య సూచనలు ఇవ్వడం జరిగింది. చైల్డ్ కేర్ టోల్ ఫ్రీ నెంబర్ 1098, టెలి మానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416 గురించి వివరించడం జరిగింది. మానసిక ఆందోళనలు ఉన్నవారు పై టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఉచితంగా పరిష్కారాన్ని తెలుసుకోవచ్చు. మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అందుకు అన్ని విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించడం జరిగింది. ఈ సమావేశంలో మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ పుష్పలతతో పాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ కోఆర్డినేటర్లు, ఎన్సీడీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ కొండ, అశోక్ పాల్గొనడం జరిగింది.

## లైంగిక వేధింపులు సైబర్ నేరాలపై అవగాహన

**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో బాలల హక్కులు, రక్షణ, లైంగిక వేధింపులు ,సైబర్ నేరాలు అవగాహన కార్యక్రమ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, జిల్లా వైద్య



ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని ఆ దిశగా కృషి చేయాలని తల్లిదండ్రుల విలువ తెలుసుకొని కష్టపడే చదువు కోవాలని గ్రామానికి స్కూలుకు మంచి పేరు తీసుకోవాలని చిన్నతనంలో మంచి అలవాట్లు నేర్చుకొని ఎవరు ఎటువంటి మోసాలకు పాల్పడకుండా వాటికి గురి కాకుండా ఉండాలంటే వాట్సాప్ ద్వారా ఆన్లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటికి అన్నిటికి దూరంగా ఉండాలని తెలియజేశారు. అదే విధంగా లైంగిక దోపిడీ, లైంగిక నేరం, భద్రత వాటిపైన చిన్న పిల్లల్లో అక్రమ రవాణాకు లోన్ అవుతున్నారని కాబట్టి వాటిని నివారించాలంటే అవగాహన కలిగి ఉండాలని ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 1098 కి సమాచారం ఇవ్వాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి యం. రాంబాబు , డిసిపి కౌన్సిలర్ స్వరూప, రవి ఆర్ బి ఎస్ కే మెడికల్ ఆఫీసర్, సైకియాట్రిక్ట్ పుష్పలత , కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెళ్ళైన వెంటనే చెక్కులిచ్చేలా చర్యలు

- ఎమ్మెల్యే పాయల శంకర్

**టీ మీడియా, డిసెంబర్ 10, ఆదిలాబాద్ :**
పెళ్ళైన వెంటనే లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తే వారికి ఆర్థికంగా వారికి ఇబ్బందులు తొలగుతాయని ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదిలాబాద్ అర్బన్, రూరల్, మావల మండలాలకు చెందిన 191 మంది



లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో మధ్య దళారులను నమ్మవద్దని సూచించారు. ఎవరికి కూడా ఒక రూపాయి కూడా ఇచ్చే అవసరం లేదని సంక్షేమ పథకాలు లబ్ధిదారుల హక్కు అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎంతో కష్టపడి ఆడపిల్ల పెళ్లి చేస్తారన్నారు. తాను అందరికీ ఎమ్మెల్యేనని ఓటు వేసిన వెయ్యకున్న అందరి సంక్షేమం కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు బిజెపి కౌన్సిలర్లు నాయకులు ఉన్నారు.

## టాలెంట్ టెస్ట్ లో విద్యార్థుల ప్రతిభ

**టీ మీడియా, డిసెంబర్ 10,రామగిరి :**
కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ బయాలజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ను మండల బాధ్యులు టి శంకర్, జి మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ టాలెంట్ టెస్ట్ లో మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల రొంపి కుంట జిల్లా పరిషత్ పాఠశాల జూలపల్లి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ



టాలెంట్ టెస్ట్ లో ప్రథమ నిలిచిన ఆర్ (శ్రీ వేణి కమాన్ పూర్ పాఠశాల) ద్వితీయ స్థానంలో (వి వరుణ్ జిల్లా పరిషత్ పాఠశాల జూలపల్లి) లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ, అభివృద్ధికి మూలం సైన్స్ అని ఇటువంటి సైన్స్ టాలెంట్ టెస్ట్ ల ద్వారా పిల్లలకు సైన్స్ పట్ల అభిరుచిని కలిగించి సైన్స్ ప్రాముఖ్యతను తెలుసుకొనేలా మరియు నూతన ఆవిష్కరణలను కనుగొనేలా తయారు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు సరళ, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు పరిమళాదేవి, శిరోమణి, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సతీష్, నంబయ్య, మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై రైల్వే మంత్రికి వినతి



**టి మీడియా, డిసెంబర్ 10,ఢిల్లీ:**
కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ నాయకుడు దాస్యం వినయ్ భాస్కర్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఇతర నాయకులతో కలిసి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం కలిశారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, రైల్వే డివిజన్ ఇతర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రైల్వే శాఖ మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ..60 ఏళ్ల స్వరాష్ట్ర స్వప్నం ఎలాగో, 40 ఏళ్ల కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల కల అని తెలిపారు.నాడు ఉద్యమ సమయంలో శ్రీకృష్ణ కమిటీకి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు ఇచ్చామని దాస్యం వినయ్ భాస్కర్ గుర్తుచేశారు. నాటి ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి పార్లమెంట్ సభ్యులు, మేము కలిసి విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేసిన విషయాన్ని తెలిపారు. న్యాయంగా కాజీపేటకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీ పలు రాష్ట్రాలకు తరలిపోయిన తీరును వివరించారు. వివిధ దశల్లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం వచ్చిన ఉద్యమ శక్తులతో కలిసి చేసిన పోరాటాన్ని, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు.కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని సైతం కేసీఆర్ హయాంలోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అప్పగించిందని దాస్యం వినయ్ భాస్కర్ గుర్తు చేశారు. కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ స్థాయికి త్వరితగతిన అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో కొన్ని రైళ్లు హాల్ట్ జరగాలని, ప్లాట్‌ఫామ్‌లు పెంచాలని, ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు. వరంగల్‌లో ఉన్న రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రకటనను స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రజల అభీష్టాన్ని అర్థం చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ఏర్పాటును సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కోరారు. 60 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్నారు. కాజీపేట ఐటీఐ కాలేజీ విద్యార్థులకు స్థానికంగా అప్రెంటిషిప్ కల్పించాలని కోరారు. చిరువ్యాపారులకు వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని, బోడగుట్ట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న ఫాతిమా బ్రిడ్జి త్వరగా పూర్తి అయ్యేలా రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే సమన్వయం, ఇతర సహకారం అందించాలని కోరారు.



# భారీగా డ్రగ్స్ పట్టివేత..

**టి మీడియా, డిసెంబర్ 10,మేడ్చల్:**
పోలీస్ స్టేషన్ పరిధిలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. 600 గ్రాముల డ్రగ్స్ తో ఆర్టీసీ బస్సు లో ప్రయాణిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ స్వాధీనం చేసుకొని.. నిందితుడిని మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. అంతేకాదు రాష్ట్రంలో డ్రగ్స్ మాటే వినపడొద్దని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి మాటలను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. అందుకే నిత్యం అప్రమత్తంగా ఉంటూ డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు. అంతేకాదు.. డ్రగ్స్ కట్టడి కోసం ప్రభుత్వం నార్కోటిక్ బ్యూరోని ఏర్పాటు చేసింది. దీనికి డీజీ స్థాయి అధికారులను నియమించింది. పెద్ద ఎత్తున నిధులతో పాటు సిబ్బందిని కేటాయించింది.

# పాత విగ్రహాన్ని కొనసాగించాలని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



**టీ మీడియా, డిసెంబర్ 10,** రామకృష్ణాపూర్‌బీక్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమైక్య పాలనలో తెలంగాణ అడుగడుగునా విస్మరణలకు గురైన సందర్భంలో ఎగసిన తెలంగాణ బిడ్డల పునరుత్పాదన కేతనంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో నిలిచింది.తెలంగాణ సంస్కృతి,అంతటి రాజసం ఉట్టిపడే తెలంగాణతల్లి రూపాన్ని మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేసి విగ్రహాన్ని మార్చిందని అన్నారు.తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడాన్ని నిరసిస్తూ,పాత తెలంగాణ తల్లి విగ్రహాన్నే కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, పోగుల మల్లయ్య,రేవల్లి ఓదెలు, జిలకర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను వేధించిన తాగుబోతుకు దేహశుద్ధి



**టీ మీడియా,డిసెంబర్ 10,గోదావరిఖని :**
గోదావరిఖని నుండి ఓడేడు వెళ్లే బస్సులో ఎక్కిన తాగుబోతు మంగళవారం ఒక మహిళను వేధించడముతో ఆ మహిళ,వాళ్ళ భర్తకు ఫోన్ చేసి చేప్పడముతో వాళ్ళు వచ్చి ఆ తాగుబోతుని దేహశుద్ధి చేయడముతో,కోపోద్రిక్తు డైనా తాగుబోతు బస్సులో వున్న మహిళలను దూసిస్తూ,బస్సు అద్దాలను ధ్వంసం చేసాడు.ఇది 8 ఇంక్లైన్ కాలనీ షిర్కే బస్టాండ్ దగ్గర జరిగింది 2 టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## న్యాయమైన కోరికలను తీర్చాలి

- పలుస శంకర్ గౌడ్



**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు 4 రోజులు నుండి తమ డిమాండ్స్ నేరవేర్చాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని శంకర్ గౌడ్ సందర్శించి ప్రసంగించారు.భావి తరాలకు బంగారు బాటలు వేసే విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కనీస ఉద్యోగ భద్రత లేకుండా జీవితములో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. దాదాపు 19600 మంది ఉద్యోగులు పాఠశాల విద్యా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని వారి న్యాయమైన డిమాండ్స్ నేరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరనీ రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు పే స్కేల్ ఇవ్వాలని,ప్రతి ఉద్యోగికి జీవిత భీమా 20లక్షల సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య భీమా 10లక్షలు ఇవ్వాలని,ఎస్ఎస్ఎ ఉద్యోగులకు పదవి విరమణ సందర్భంగా బెనిఫిట్స్ క్రింద 20లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వంలో , విద్యా శాఖలో వెయిటేజి ఇవ్వాలని, పీటీఈ లకు 12నెలల జీతం ఇవ్వాలని శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

## మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు పొడిగింపు



**టీ మీడియా,డిసెంబర్ 10,గోదావరిఖని :**
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు పొడిగింపురామగుండం కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు సీపీ ఎం.శ్రీనివాస్ తెలిపారు.సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 1 నుండి జనవరి 1 వరకు కొనసాగుతాయని తెలిపారు.అలాగే డీజే,డ్రోన్ లపై నిషేధాజ్ఞలు పొడగిస్తున్నట్లు మంగళవారం పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆశా వర్కర్లు అరెస్టు..



**టీ మీడియా, డిసెంబర్ 10,జన్నారం:**
జన్నారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలను ఎస్సై రాజ వర్ధన్ మంగళవారం అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. ఆశాకార్యకర్తల జిల్లా ఉపాధ్యక్షురాలు తొగరి లీలా మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆ సమస్యపై సోమవారం హైదరాబాద్ వచ్చిన తర్వాత ఎవరి ఇండ్లలో వాళ్ళు ఉండగా కూడా తమను పోలీసులు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మండల వైస్ ప్రెసిడెంట్ మంజుల శైలజ కవిత కళావతి తదితరులు ఉన్నారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు: ఎస్ఐ



**టీ మీడియా, డిసెంబర్ 10,దుబ్బాక:**
విద్యార్థి దశలో విలువైన సమయాన్ని వృధా చేయకుండా చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చదువే పునాది అని దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని రామక్కపేట బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళల రక్షణ చట్టాలు గురించి సిద్దిపేట షీ టీం బృందంతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని.. ఆపద సమయంలో 100 నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ మానస,ప్రిన్సిపల్ శారద,ఉపాధ్యాయ బృందం,షీ టీం బృందం కిషన్, మమత, వీణకుమారి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంల గోదాము

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**టీ మీడియా, డిసెంబర్ 10, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాము ను త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతకు చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మూడు నెలలకోసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిశితంగా పరిశీలించినట్లు వివరించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ రమేష్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కుమారస్వామి, పరమేశ్వర చారి, బాలరాజు, వేణాచారి, జమీల్ తదితరులు ఉన్నారు.

# ఏపీకి త్వరలో కొత్త డీజీపీ

## మొదలైన కసరత్తు



**టి మీడియా, డిసెంబర్ 10,అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి త్వరలో కొత్త డీజీపీని నియమించనున్నారు. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. అందుకే కొత్త డీజీపీ ఎంపిక కోసం కసరత్తు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో డీజీపీ రేసులో ఎవరున్నారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. పలువురు సీనియర్ అధికారుల పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది.అయితే ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావునే మరికొంత కాలం ఏపీ డీజీపీగా కొనసాగించవచ్చనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. కేంద్రంలో తనకు ఉన్న పరపతిని ఉపయోగించి ఏపీ సీఎం చంద్రబాబు ద్వారకా తిరుమలరావును మరికొంత కాలం కొనసాగిస్తారనే టాక్ వినబడుతోంది. ఒకవేళ ద్వారకా తిరుమలరావు పదవీకాలం పొడిగింపు సాధ్యం కాకపోతే.. ఆయన తర్వాత సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన హరీశ్ కుమార్ గుప్తాకు అవకాశం దక్కనుందిపరువు

# స్కానింగ్ కోసం వచ్చిన మహిళ

## - దుస్తులు విప్పి అసభ్య ప్రవర్తన



**టి మీడియా, డిసెంబర్ 10,విశాఖ :**లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో దారుణం చోటు చేసుకుంది. స్కానింగ్ కోసం వచ్చిన ఓ మహిళను సిబ్బంది వేధింపులకు గురి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం విశాఖకు చెందిన ఓ మహిళ తలకు గాయమై సోమవారం రాత్రి ఆస్పత్రికి వచ్చింది. స్కానింగ్ చేయించాలని వైద్యులు సూచించడంతో .. అదే ఆస్పత్రిలోని స్కానింగ్ సెంటర్‌కు వెళ్లింది.ఇదే అదునుగా భావించిన స్కానింగ్ సెంటర్ ఇన్‌ఛార్జి ప్రకాశ్ .. స్కానింగ్ కోసం దుస్తులు తీసేయాలని చెప్పాడు. ఆ తర్వాత ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళ కేకలు వేయడంతో స్పందించిన స్థానికులు ప్రకాశ్‌కు దేహశుద్ధి చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న విశాఖ మూడో పట్టణ సీఐ రమణయ్య ఆస్పత్రికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంతో రోగులు నరకం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

# మహా కుంభమేళాకు 40 కోట్ల మంది

## -భక్తుల లెక్కింపుకు సాంకేతిక పరిజ్ఞాన సాయం



**టి మీడియా, డిసెంబర్ 10,ప్రయాగ్‌రాజ్:**ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళాలో భక్తుల సంఖ్య కొత్త ప్రపంచ రికార్డు సృష్టించబోతోంది. మహా కుంభ మేళాకి వచ్చే భక్తుల సంఖ్యను లెక్కించేందుకు జాతర నిర్వాహకులు ఏఐ కెమెరాలతో పాటు అనేక ఇతర సాంకేతిక పరిజ్ఞాన సాయం తీసుకుంటున్నారు. ఈసారి మహా కుంభమేళాలో 40 కోట్ల నుంచి 45 కోట్ల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుని త్రివేణీ సంగమంలో స్నానాలు చేస్తారని అంచనా వేస్తున్నారు. కుంభ మేళాకు వచ్చే భక్తుల సంఖ్యను గుర్తించేందుకు 200 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఈసారి మహా కుంభమేళాకు వచ్చే భక్తుల సంఖ్య సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించవచ్చని భావిస్తున్నారు. ఈసారి భక్తుల సంఖ్యను లెక్కించేందుకు కుంభమేళా నిర్వాహకులు అనేక సాంకేతిక పరిజ్ఞానాలతో పాటు ఏఐ కెమెరాల సహాయాన్ని తీసుకుంటున్నారు. మహా కుంభ మేళానికి వచ్చే ప్రతి భక్తుడిని లెక్కించడంతో పాటు.. వారిని కూడా ట్రాక్ చేయవచ్చు.మహా కుంభమేళా జరిగే పరిధిలోని 200 చోట్ల భక్తుల పర్యవేక్షణ కోసం 744 తాత్కాలిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ తెలిపారు. అదే సమయంలో నగరంలో 268 చోట్ల 1107 శాశ్వత సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

**కెమెరాల ఉపయోగం**
ఐసీసీసీ, పోలీస్ లైన్ కంట్రోల్ రూమ్‌తో పాటు అరల్, ఝూన్సీ ప్రాంతాల్లో వీక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విజయ్ విశ్వాస్ పంత్ తెలిపారు. అక్కడ నుంచి భక్తులను పర్యవేక్షించేందుకు కృషి చేస్తున్నారు. AIని ఉపయోగించి క్రౌడ్ డెన్సిటీ అల్గారిథమ్ ద్వారా వ్యక్తులను లెక్కించడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. AI ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్ రియల్ టైమ్ అలర్ట్‌లను రూపొందిస్తోంది. దీని ద్వారా భక్తులను లెక్కించడం, ట్రాక్ చేయడం సంబంధిత అధికారులకు సులభం అవుతుంది.ఖచ్చితమైన లెక్కింపు ఏ విధంగా జరుగుతుందంటే
జాతర ప్రాంగణంలో నిర్మించిన ఐసిసిసిలో హెడ్‌కౌంట్ మోడలింగ్ పనిని చూస్తున్న సాంకేతిక సిబ్బంది మాట్లాడుతూ ఒక భక్తుడుని పదేపదే లెక్కించకుండా ఉండేందుకు గానూ టర్నరౌండ్ సైకిల్ ముఖ్యమని చెప్పారు. దీన్ని ట్రాక్ చేసేందుకు టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. త్రివేణీ సంగం వద్ద యాత్రికులు గడిపిన సగటు సమయాన్ని మలుపు చక్రంగా పరిగణిస్తారు. టర్నరౌండ్ సైకిల్ నుంచి కోక్రాన్ సూత్రం ఆధారంగా భక్తుల సంఖ్య లెక్కించబడుతుంది.రెండో టెక్నాలజీ ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా ప్రతిరోజూ మహా కుంభ మేళాకు వచ్చే భక్తులకు స్నానంతో పాటు రిస్ట్ బ్యాండ్ లను అందజేయనున్నారు. రిస్ట్ బ్యాండ్ %=ఖీ×ఱ% రీడర్‌తో ట్రాక్ చేయబడుతుంది. ఇది యాత్రికుడు కుంభమేళా జరిగే ప్రాంతాల్లో ఎంతకాలం బస చేశారో వెల్లడిస్తుంది. మొబైల్ యాప్ ద్వారా కూడా కుంభమేళాకు వచ్చే భక్తులను ట్రాక్ చేస్తామని చెప్పారు.

# కూటమి అభ్యర్థుల నామినేషన్స్

**టి మీడియా, డిసెంబర్ 10,అమరావతి :**
రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులుగా టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సానా సతీశ్, బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యలు నేడు తమ నామినేషన్ లు దాఖలు చేశారు.. ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ల ను బలపరుస్తూ, 10 మంది చొప్పున కూటమి ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు.వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవం కానుంది. కాగా, నామినేషన్ల అనంతరం అభ్యర్థులు మాట్లాడుతూ, కూటమి ఆశయాలకు అనుగుణంగా తమ గళాన్ని పెద్దల సభలో వినిపిస్తామన్నారు..

**బిసి గళం వినిపిస్తా-కృష్ణయ్య**
చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ కోసం పోరాటం చేస్తానని తెలిపారు బిజెపి అభ్యర్థి కృష్ణయ్య. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పిలిచి తనకు రాజ్యసభ టికెట్ ఇచ్చిందని అన్నారు. సీఎం చంద్రబాబు తనను రాజకీయాల్లోకి పిలిచారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని చెప్పారు..50 ఏళ్లు బీసీల కోసం పోరాటం చేశానని చెప్పారు. వైసీపీకి పార్టీలో మాట్లాడే అవకాశం తక్కువ అని.. బీసీల గురించి ఎక్కువగా మాట్లాడే అవకాశం ఉంటుందని పార్టీ మారానని తెలిపారు. బీజేపీ తనకు కొత్త కాదని, తాను కండువా కప్పుకున్న మొదటి పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. పార్టీల కండువాలు వేసుకోలేదు. అన్ని పార్టీలు బీసీల కోసం న్యాయం చేస్తున్నాయని చెప్పారు. పార్టీలే తన దగ్గరకు వచ్చాయని బీజేపీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

**ఏపి అభివృద్ధికి పాటు పడతా-బీదా మస్తాన్ రావు**
రాష్ట్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థి బీదా మస్తాన్ రావు తెలిపారు. అనివార్య కారణాల వల్ల రెండున్నరేళ్లు తెలుగుదేశానికి దూరమయ్యానని అన్నారు. సొంతిల్లు లాంటి తెలుగుదేశంలో కొంతకాలం లేకపోవడం ఎంతో బాధించిందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు కీలక పదవులు ఆపార్టీలో దక్కుతున్నాయని బీదా మస్తాన్ రావు తెలిపారు.

**బాధ్యతతో నిర్వర్తిస్తా: సానా సతీష్**
చిన్న వయస్సులోనే నాకు కీలక పదవి ఇచ్చి ప్రోత్సహించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ ధన్యవాదాలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని బాధ్యతతో నిర్వర్తిస్తానని సానా సతీష్ చెప్పారు.

## సిఎం చిత్రపటానికి హెూంగార్డుల క్షీరాభిషేకం



**టీ మీడియా,డిసెంబర్ 10,గోదావరిఖని :**
హెూంగార్డుల రోజువారి వేతనం 1000 కి పెంపు చేయడంతో పాటు, ప్రమాదవశాత్తు చనిపోతే 5 లక్షల ఎక్స్ గ్రేషియా,విక్లీ పరేడ్ అలవెన్స్ ను రూ. 200కు పెంచడంతోపాటు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని 2025 జనవరి 1 నుంచి హెూంగార్డులకు వర్తింప చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి, ఈ నెల 6 న హెూంగార్డుల రైజింగ్ డే సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం రామగుండం పోలీస్ కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ హెూం గార్డ్స్ ఆఫీస్ వద్ద హెూంగార్డులు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.కార్యక్రమంలో హెూంగార్డు ఆర్ ఐ మల్లేశం,పెద్దపల్లి జోన్ హెూం గార్డ్స్ ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ మనోహార్,హెూం గార్డ్స్ పిఎల్ సి సత్యనారాయణ, కుమార్,బ్రమ్మచారి, శ్రీనివాస్,నర్సయ్య, చంద్రమౌళి,రాము పాల్గొన్నారు.

## 19న ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక

- పోస్టర్లు ఆవిష్కరించిన సంఘం నాయకులు



**టీ మీడియా, డిసెంబర్ 10, ఆదిలాబాద్ :**
జనవరి 19న ఆర్యవైశ్య వధూవర పరిచయ వేదికను నిర్వహించడం జరుగుతుందని ఆర్యవైశ్య పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి హరీష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పరిచయ వేదిక పోస్టర్లను విడుదల చేశారు. ఆలయ అర్చకులు అక్షయ్ పంతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో వధూవర పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి హరీష్ తెలిపారు. మావల మండల కేంద్రంలోని చిల్కూరి లక్ష్మీ గార్డెన్లో జనవరి 19న ఉదయం 9.30 నిమిషాల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరిచయ వేదిక ఉంటుందని తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఏపీల నుంచి వధువరులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ కొత్తవార్, గిరిష్, నర్సిములు, ప్రసాద్, ఉల్లాస్, పాల్దే ప్రసాద్, సంజయ్, జయ, సునైన, సంతోషి, సరిత పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం



**టీ మీడియా, డిసెంబర్ 10,జన్నారం:**
మండలం కామన్ పల్లి గ్రామా నిరుపేద గల్ఫ్ కుటుంబనికి చెందిన కామెర దుర్గయ్య అనే కార్మికుడు అనారోగ్యంతో ఇటీవలే మరణించాడు. విషయం తెలుసు కున్న కామన్ పల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సేవాభావం కలిగిన కార్మిక మిత్రులు విరాళాలు సేకరించి రూ.4000 వేలను మంగళవారం వారి కుటుంబానికి అందించేసారు. ఈ కార్యక్రమంలో కామనపల్లి గల్ఫ్ కార్మికుల వ్యవస్థాపకులు జునుగురు నాగరాజు, జునుగూరు వెంకటేష్,జాడి కిరణ్, పసుల రాజన్న, కోడిజుట్టు రాజేష్, కేతానవేణి చిలుకలయ్య,జనుగూరు రామన్న,కామేర దుర్గయ్య,కొడిజుట్టు సురేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వరిలో వెదజల్లే పద్ధతిలో ఖర్చు తక్కువ వ్యవసాయ అధికారిణి భాను



**టీ మీడియా, డిసెంబర్ 10,రామారెడ్డి :**
వరి పంట సాగులో వెదజల్లే పద్ధతిలో ఖర్చు తక్కువతో లాభం ఎక్కువగా ఉందని మండల వ్యవసాయ అధికారిణి భాను శ్రీ మంగళవారం మండలంలో వరి సాగును వెదజల్లే పద్ధతిపై అవగాహన కల్పించగా రైతులు వెదజల్లే పద్ధతి పై మొగ్గ చూపుతున్నారని అన్నారు. రామారెడ్డి లో రైతు వెదజల్లే పద్ధతిలో వరి సాగును వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతులకు సాగుపై మెలకువలను సూచించారు. వెదజల్లే పద్ధతిలో రూ.5 వేల నుండి 6 వేలు ఖర్చు తగ్గుతుందని, కూలీల కొరతను అధిగమించవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఏ ఈ ఓ రాకేష్, నికిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ బాబు ఇంటి పనిమనిషి

### -ఆత్మహత్యాయత్నం..



**టి మీడియా, డిసెంబర్ 10,హైదరాబాద్ :**
ప్రస్తుతం మంచు ఫ్యామిలీలో ఎటువంటి వాతావరణం నెలకొని ఉందో తెలియంది కాదు. మంచు మనోజ్ ఒకలా, మంచు మోహన్ బాబు మరోలా.. ఇప్పుడు కొత్తగా మంచు విష్ణు కూడా రంగంలోకి దిగడంతో.. టాలీవుడ్ అంతా ఈ ఫ్యామిలీ గురించే మాట్లాడుకుంటోంది. ఇదిలా ఉంటే, మంచు మోహన్ బాబు ఇంట్లో పని చేసే పనిమనిషి.. అసలు ఆ ఫ్యామిలీలో ఏం జరిగిందో చెబుతున్న వీడియో ఒకటి బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం నుంచి ఆమె వీడియో వైరల్ అవుతుండటంతో.. తనకు జరగరానిది ఏదో జరుగుతుందని భావించిన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లుగా సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అసలు మోహన్ బాబు పని మనిషి ఏం చెప్పిందంటే.. మోహన్ బాబు ఇంట్లో జరుగుతున్న గొడవకి కారణం ఇంటిలో పని చేస్తున్న స్టాఫే కారణం అని ఆమె తెలిపింది. మోహన్ బాబుపై మంచు మనోజ్ చేయి చేసుకున్నాడని.. తండ్రీ కొడుకులు నెట్టుకున్నా.. ఎవరికీ దెబ్బలు తగలలేదని తెలిపింది. ముఖ్యంగా మంచు మనోజ్‌కు దెబ్బలు తగిలినట్లుగా వార్తలు వచ్చిన నేపథ్యంలో అలాంటిదేమీ లేదని ఆమె తెలిపింది.